క్లుప్తంగా

డెంగీ అవగాహన ర్యాలీ నేడు

ఆత్మకూరు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాకేష్, డాక్టర్ అస్మా సోమవారం తెలిపారు. మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని హెల్త్ సెంటర్ నుంచి ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు, ఏఎన్ఎంలు ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: సంగంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సీతా సమేత రామచంద్రస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పూల అలంకరణ చేసి హనుమంతుని వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2023–24 విద్యా సంవత్సరంలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ ట్రేడ్‌ల్లో మొదటి విడత ఖాళీలను భర్తీ చేసేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ అర్హత ఉన్న అభ్యర్థులు జూన్ నెల 6వ తేదీలోగా iti. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమీప ఐటీఐ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని 67వ నంబరు జాతీయ రహదారిపై డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనాలతో రాకపోకలు సాగించాలని వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వెంట మర్రిపాడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ క్షేత్రాధికారి మోహన్‌రావు

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళి మనుగడను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కావలి అటవీ క్షేత్రాధికారి వై.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని తుమ్మలపెంటలో సోమవారం పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ భూతం ప్రపంచ మానవాళికి ముప్పు ఏర్పడేలా అనేక అంతుచిక్కని అంట వ్యాధులతో సతమతమవుతువున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పి భావితరాలకు బంగారు భవిష్యత్‌ను అందించాలన్నారు. అనంతరం సచివాలయం, సముద్రతీరం వెంబడి వ్యర్థాలను తొలగించి గ్రామస్తులకు అవగాహన కల్పించి పర్యావరణాన్ని పరిరక్షించేలా ప్రతిజ్ఞ చేయించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజున వసంతోత్సవం, పార్వేట, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అల్లూరు మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్క పంచాయతీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అల్లూరు మండలంలో తిరిగి గడప గడపకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, అప్పుడు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అక్కడికక్కడికే తీర్చే విధంగా కృషి చేస్తామన్నారు.

త్వరలోనే పంచాయతీగా మార్పు

అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేట గ్రామాలను నగర పంచాయతీ నుంచి త్వరలోనే పంచాయతీలుగా మార్పు చేసే విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆయా గ్రామాలను కలిపి నగర పంచాయతీగా మార్పు చేయడం వల్ల ఉపాధి హామీ పనులు ఉండడం లేదన్నారు. పలు సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నామని తమ ప్రాంతాల్లో ఎక్కువగా ఎస్టీ కాలనీలు ఉన్నాయని, తమ గ్రామాలను నగర పంచాయతీ నుంచి గతంలోని మాదిరిగా పంచాయతీలుగా మార్పు చేయాలని ప్రజలు కోరారన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ముఖ్యమంత్రి కావలి పర్యటన సందర్భంగా ఈ సమస్యను మరోమారు గుర్తు చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి పంచాయతీగా చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆనందం

అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేట ప్రాంతాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వచ్చే నెల నుంచి రూ.2 వేల వేతనం పెంచుతున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో పారిశుధ్య కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమంలో తాము చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నామని, తమను గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని, తమకు కొంత మేర జీతం పెంచితే మేలు చేకూరుతుందని పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దీంతో వచ్చే నెల నుంచి రూ.2 వేల పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, హౌసింగ్ ఏఈ జమీల్, ఏఓ వేణుగోపాల్‌రావు, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఊటు శ్రీకాంత్ రెడ్డి, సాధిక్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, మేడా శ్రీనివాసులరెడ్డి, బి.సుధ, పి రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి భూమి పూజ



సోమశిలలో జగనన్న కాలనీకి భూమి పూజ చేస్తున్న ఏఈ

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం సోమశిలలో సోమవారం జగనన్న కాలనీకి ఏఈ ఉదయభాస్కర్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సోమశిలలో 150 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించామన్నారు. ఇటీవల ఐసీఐసీఐ బ్యాంక్ ఏజెన్సీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల వద్ద వివరాలు సేకరించామన్నారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల కల నెరువేరుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుండబోయిన ఈశ్వరయ్య, ముక్కు మస్తాన్‌గౌడ్, గుండబోయిన వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్, నాయకులు శంకర్, దేవిరెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామ సభలు



బొమ్మవరం అగ్రహారం సచివాలయంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి డీఆర్పీ బృందం సోమవారం సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లి, దేవరాయపల్లి, బిట్–2 ఆమని చిరువెళ్ల అనంతసాగరం, గౌరవరం, సోమశిల, మంగుపల్లి, చిలకలమర్రి, బొమ్మవరం, గుడిగుంట, ముస్తాపురం ప్రాంతాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు, కూలీలకు ఇచ్చిన వేతనాలపై డీఆర్పీలు విచారించారు. ఎక్కువగా కాలువ పనులు, పూడికతీత పనులు జరిగాయి. ఉపాధి హామీ పథకం కింద బొమ్మవరం సచివాలయ పరిధిలో రూ.40 లక్షలతో సచివాలయం, రైతుభరోసా కేంద్రం రూ.21.80 లక్షలతో పాలశీతలీకరణ కేంద్రం రూ.15.60 లక్షలతో నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి బొమ్మవరం అగ్రహారం సచివాయంలో గ్రామసభ నిర్వహించారు. నేటితో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామ సభలు ముగిశాయి. ఆయా గ్రామ సభల్లో ఎస్ఆర్‌పీ మురాద్, డీపీఓ దయాసాగర్, డీఆర్పీలు మనోహర్, ఇంతియాజ్, అంకయ్య, అనిల్, నాయకులు ఏ అంకిరెడ్డి పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆత్మకూరు లైబ్రేరీలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరావు సూచించారు. ఆత్మకూరులోని గ్రంథాలయంలో కొద్ది రోజులు సాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విజ్ఞానదాయక విషయాలపై ఆసక్తి చూపి అవగాహన చేసుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని పోటీ పరీక్షలను సునాయాసంగా ఎదుర్కోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఓంకారం రాజు, అసిస్టెంట్ తనూజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు మొబైల్ నంబరు అనుసంధానం



రామాపురంలో హార్టికల్చర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ గాయత్రి

వరికుంటపాడు: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీ తన మొబైల్ నంబర్‌ను జాబ్‌కార్డుకు అనుసంధానం చేయాలని ఏపీడీ గాయత్రి అన్నారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె పంచాయతీల వారీగా పనుల ప్రగతిపై సమీక్షించి క్షేత్ర సహాయకులకు సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రతి రోజూ నాలుగు వేల మంది కూలీలు పనిలో పాల్గొనాలన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్ర సహాయకులు, మేట్‌లు కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు చేయాలన్నారు. రూ.265 కనీస కూలి గిట్టుబాట య్యేలా కొలతల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. కూలీలు తాగునీరు వెంట తెచ్చుకోవాలన్నారు. క్షేత్రసహాయకులు, మేట్‌లు కేటాయించిన కొలతల ప్రకారమే పనులు చేయాలన్నారు. అంతకు ముందు ఆమె మండలంలోని రామాపురంలో హార్టికల్చర్‌ను పరిశీలించి రైతులకు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బి.శ్రీనివాసరావు, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

పదేపదే విద్యుత్‌కు అంతరాయం



డీసీపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలం డీసీపల్లిలోని భారత పొగాకు బోర్డు ఆధ్వర్యంలో నడుస్తున్న పొగాకు వేలం కేంద్రం జిల్లాలోని 18 మండలాలకు చెందిన పొగాకు రైతులకు సేవ అందిస్తోంది. వ్యవసాయ సీజన్‌లో పొగాకు కొనుగోలు సమయం ఈ వేలం కేంద్రంలో ఆరు నెలల పాటు కీలకంగా ఉంటుంది. వేలం కేంద్రం పక్కనే విద్యుత్ సబ్ స్టేషన్ కూడా ఉంది. అయితే రోజులో కనీసం 30 నుంచి 50 సార్లు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పొగాకు బేళ్ల కాటాలతో పాటు కార్యాలయ సిబ్బంది కార్యాకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఉత్పత్తులు వేలం నిర్వహించే సమయంలో పొగాకు బోర్డు అధికారులు, కొనుగోలు కంపెనీల బయ్యర్లు, సిబ్బంది, రైతులు కలిసి కనీసం 200 మంది వేలం నిర్వహించే ప్లాట్‌ఫాంలోనే ఉంటారు. అసలే వేసవి కాలం కావడంతో పది నిమిషాలు కరెంట్ లేకపోయినా ఉక్కపోతతో వీరంతా అల్లాడుతున్నారు. ఈ విషయమై మర్రిపాడు ఏఈ బాలసుబ్రహ్మణ్యంను వివరణ కోరగా పడమటిగాలులు వల్ల విద్యుత్ సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీతారాముల 16 రోజుల పండగ



సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లిలో రామాలయం వద్ద సోమవారం రాత్రి సీతారాముల 16 రోజుల పండగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేష అలంకరణలతో రామాలయం వద్ద భక్తులు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ పూజారి చింతలపల్లి మధుసూదన్ శర్మ విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిట్టెం శ్రీనివాసులు, మన్నెం బ్రహ్మారెడ్డి, మునగచర్ల వెంకటేశ్వర్లు, జంపన రమేష్‌రెడ్డి, పత్తిపాటి చిన్నా, రేవూరు గోపాల్ రెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

సంగం: పర్యావరణాన్ని పరిర క్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని అటవీశాఖ డీఆర్‌ఓ పిచ్చిరెడ్డి అన్నారు. సోమవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సగం బీట్‌లోని సంగం కొండ వద్ద పల్లెవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవడం గురించి వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, సేవ్ ఎనర్జీ, నీటి కుంటలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. స్థానికుల సహకారంతో చెత్తను తొలగించే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



కరటంపాడులో చలివేంద్రం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు బస్టాండ్ సెంటర్‌లో 67వ నంబరు జాతీయ రహదారి పక్కన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కరటంపాడు సచివాలయం పరిధిలోని సాతానుపల్లి, శ్రీనివాసపురం, ఆరవేడు, జంగాలపల్లి, రామాపురం, బోయలచిరివెళ్ల, కరటంపాడు గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని వేసవి తాపానికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామని కార్యక్రమంలో పాల్గొన్న మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, స్థానిక నాయకులు నెట్టెం పిచ్చయ్యనాయుడు పేర్కొన్నారు.

భానుడి భగభగ



సంగం: నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న వీధులు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): రోజురోజుకు వేసవి తాపం పెరుగుతోంది. సోమవారం మరింతగా పెరగడంతో ఆత్మకూరు, మర్రిపాడు మండలాల పరిసర ప్రాంతాల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ వేడిమికి ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ కరెంట్‌కు అంతరాయం ఏర్పడుతుండడంతో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం అత్యధికంగా 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో సాయంత్రం 5 గంటల వరకు వేడిగాలుల తాకిడికి చిన్నారులు, వృద్ధులు తల్లడిల్లిపోయారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన భానుడి ప్రతాపం, మధ్యాహ్నం వేళ తీవ్రరూపం దాల్చడంతో చెట్ల కింద ఉన్న వారు సైతం వేడిగాలులకు తల్లడిల్లారు. ఎండ తీవ్రత మరో వారం రోజులు కొనసాగే అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప బయట తిరగకుండా జాగ్రత్త పడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిర్మానుష్యంగా వీధులు

సంగం: రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చాయి. 45 డిగ్రీల ఉష్ణోగత ఉండడంతో ప్రజలు విలవిలలాడారు. ప్రయాణికులు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాలంటే ఎండవేడి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో వీధులన్ని నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. పలు ప్రాంతాల్లో చెట్లు ఉన్న ఎండ తీవ్రతకు చెట్ల కింద కూర్చోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తీరంలో ఎగిసిపడుతున్న అలలు



ఎగిసి పడుతున్న అలులు



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ పోలీసులు

• మెరైన్ పోలీసుల అప్రమత్తం
• పర్యాటకులను సముద్రంలోకి వెళ్లొద్దంటూ సూచన

కావలి రూరల్: మోచా తుఫాన్ ప్రభావంతో తీరం వెంబడి అలలు దాదాపు 5 నుంచి 6 అడుగులు ఎత్తున ఎగిసి పడుతున్నాయి. మండలంలోని తుమ్మలపెంట సముద్రతీరం అలల ఉధృతికి కొంత మేర కోతకు గురైంది. వేసవి సెలవులు కావడంతో సరదాగా పిల్లలతో సముద్రం వద్దకు వచ్చిన పర్యాటకులను సముద్రంలోకి వెళ్లదంటూ మెరైన్ పోలీసులు పలు సలహాలు సూచనలు అందిస్తున్నారు.

రిటైర్ ఆర్మీ ఉద్యోగులకు ఘన సన్మానం



దేవిశెట్టిపల్లిలో రిటైర్ ఆర్మీ ఉద్యోగులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

సీతారామపురం: మండలంలోని దేవిశెట్టిపల్లిలో ఆర్మీలో పనిచేస్తూ రిటైర్ అయి గ్రామానికి విచ్చేసిన ఆర్మీ ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. లెఫ్టినెంట్ ఆర్‌వీఎస్ రాయుడు, హవల్దార్లు ఎం.వెంకటనారాయణ, ఏ వెంకటప్రసాద్ ఆర్మీలో పని చేస్తూ ఇటీవల రిటైర్ అయ్యారు. సోమవారం స్వగ్రామానికి రాగా గ్రామస్తులు తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆర్మీలో వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేనాటి రమణయ్య, రేనాటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కళాశాలలో తరగతి గది మార్పు



మార్పు చేసిన తరగతి గదిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఉదయగిరి: రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశాల మేరకు కళాశాలలో విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న తరగతి గదిని మార్పు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ప్రభుత్వ కళాశాలను సందర్శించారన్నారు. ఆ సమయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతుల గదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వెంటనే తరగతి గదిని అన్ని వసతులున్న చోటుకు మార్చాలని సూచించారని, ఆయన ఆదేశాల మేరకు ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించామన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కలిగిన గదిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయాన్ని ముఖ్య కార్యదర్శికి నివేదిక అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి



మిషన్ లైఫ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): ప్రకృతి వనరులను కాపాడుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని, తద్వారా మానవ మనుగడ సాకారం అవుతుందని మర్రిపాడు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవీంద్రబాబు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మిషన్ లైఫ్ అనే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కసారి వినియోగించిన ప్లాస్టిక్‌ను ఆ తర్వాత ఏ విధంగా నిర్వీర్యం చేయాలో వివరించారు. నీరు వృథా కాకుండా ఆదా చేయడం, చిన్న, చిన్న పనులకు పెట్రోల్, డీజిల్‌తో అవసరం లేకుండా సైకిల్‌ను వాడడం వంటి చర్యల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని విద్యార్థులకు తెలియజెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ మల్లికార్జునరావు, అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు అన్నదానం అభినందనీయం



ఆహార పొట్లాలు అందజేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

కావలి: కావలిలోని ఆర్డీఓ కార్యాలయంలో జరిగే స్పందనకు వచ్చే అర్జీదారులకు భోజనం ఏర్పాట్లు అభినందనీయమని రామాయపట్నం పోర్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ సమకూర్చిన భోజన పొట్లాలను పద్మావతి స్పందన అర్జీదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో జరిగే స్పందనకు, దూర ప్రాంతాల నుంచి పెండింగ్ సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీదారుల ఆకలి తీర్చాలని ఆర్డీఓ శీనానాయక్ ఆలోచన చేయడం, రెడ్‌క్రాస్ సహకారంతో ఆచరణలో పెట్టడం ప్రశంసనీయమన్నారు. భోజన దాత రొటేరియన్ తుమ్మలపల్లి గోపాలకృష్ణమూర్తిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి అధ్యక్షుడు మల్లి పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

• పట్టణంలో ఐదు ఇళ్లల్లో చోరీలు
• రెండు సెల్‌ఫోన్లు, నగదు అపహరణ



కావలిరూరల్: కావలి పట్టణంలో దొంగలు మరోసారి విజృంభించారు. ఇళ్లల్లో యజమానులు నిద్రిస్తున్న సమయంలో ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. అందిన కాడికి అపహరించుకుని పోయారు. ఈ ఘటన కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితుల సమాచారం మేరకు.. జంగం తిరుతయ్య ఇంట్లో రూ.22 వేలు విలువ చేసే సెల్‌ఫోన్, బ్యాగ్ అపహరించారు. అయితే బ్యాగ్‌లో ఏమి లేకపోవడంతో బయట పడేశారు. నిందితుడు తీసుకువచ్చిన స్క్రూ డ్రైవర్, కత్తిను అక్కడే వదిలి వెళ్లారు. అదే వీధిలో సత్యవతి ఇంట్లో బీరువాను తెరిచి గాలించారు. అందులో ఉన్న రూ.2 వేల నగదును అపహరించారు. అందులో ఉన్న వస్తువులను చెల్లాచెదురుగా పడేశారు. షకీలా, బాబు దంపతుల ఇంట్లో సెల్‌ఫోన్, రూ.1300, మరో ఇంట్లో రూ. 1500 నగదుతో పాటు స్కూటర్‌లోని పెట్రోలు అపహరించారు. బుజ్జమ్మ అనే మహిళ తన భర్తకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మేలుకోని ఉన్నారు. దొంగ ఇంటి వాకిట వద్దకు వచ్చి చూస్తుండటాన్ని గమనించిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ మేరకు బాధితులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.